సాక్షి ఆదిలాబాద్

సోమవారం । 26 । ఆగస్టు । 2024



ఉచిత వైద్య శిబిరం

బేల: మండలంలోని సాంగ్వి(కె) గ్రామంలో జమాతే ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో డేర్ సంస్థ వైద్య బృందం నిపుణులతో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు.

బురద ఇలా.. వెళ్లేదెలా?



బజార్‌హత్నూర్ మండలం ధరంపురి పంచాయతీ పరిధిలో గల యేసాపూర్ గ్రామానికి వెళ్లే దారి బురదమయంగా మారింది. వానా కాలం వచ్చిందంటే గ్రామస్తులకు దారి కష్టాలు తప్పడం లేదు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.0/24.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సమస్యలు పరిష్కరించాలి

ఆదిలాబాద్‌టౌన్: సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు పడాల రవీందర్ డిమాండ్ చేశారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. 27న మండల స్థాయిలో సమావేశం, 28న మహా ర్యాలీ, ధర్నా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే సామూహిక సెలవు పెట్టాలని నిర్ణయించారు. సమావేశంలో సంఘ బాధ్యులు ప్రకాశ్, వెంకటి, దేవదర్శన్, శ్రీకాంత్, సురేశ్, సోమన్న, నాగనాథ్, పాల్గొన్నారు.

పిప్పర్‌వాడలో డెంగీ పాజిటివ్

జైనథ్: మండలంలోని పిప్పర్‌వాడలో గల ఓ ప్రైవేట్ పాఠశాల విద్యార్థికి డెంగీ పాజిటివ్ నిర్ధారణ కావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఎంపీడీవో రవీంద్రనాథ్, గిమ్మ పీహెచ్‌సీ వైద్యులు సుచల, సిబ్బందితో కలిసి పాఠశాలలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు చేపట్టారు. అనంతరం పరిసరాలు పరిశీలించి పరిశుభ్రత చర్యలు పాటించాలనియాజమాన్యాన్ని ఆదేశించారు.

ఈపీఎఫ్ లబ్ధిదారుల అవగాహన శిబిరం

మంచిర్యాలటౌన్: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ(ఈపీఎఫ్‌వో) ప్రాంతీయ కార్యాలయం కరీంనగర్‌కు చెందిన అధికారులు ఈ నెల 27న ఈపీఎఫ్ లబ్ధిదారులకు అవసరమైన సేవలు అందించేందుకు ఒక్కరోజు శిబిరాన్ని ఉమ్మడి జిల్లాలో నిర్వహించనున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ సెల్వక్కర్ తానయ్య ప్రకటనలో పేర్కొన్నారు. 27న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.45 గంటల వరకు ఉమ్మ డి జిల్లాలోని ఆయా జిల్లాల్లో నిర్వహిస్తున్నామని, పీఎఫ్ లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మంచిర్యాల జిల్లాకు సంబంధించి మంచిర్యాలలోని డీఆర్డీఏ కాన్ఫరెన్స్ హాల్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్ కాగజ్‌నగర్‌లోని శ్రీకృష్ణవేణి హైస్కూల్‌లో, ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని డీఆర్డీఏ కాన్ఫరెన్సు హాల్‌లో, నిర్మల్‌లో ప్రిన్స్ హైస్కూల్, గాజుల్‌పేట, పాత ఎస్‌హెచ్7 రోడ్డులో ఈ శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈడీఎల్ఐ పథకం, ఈడీఎల్ఐ అర్హత, లబ్ధిదారుల కేవైసీ, ఈపీఎఫ్‌వోపై అవగాహన సేవలు పొందవచ్చని తెలిపారు.

సైబర్ కేటుగాళ్లు



- ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ఓ ఆర్టీసీ డ్రైవర్‌కు ఇటీవల సైబర్‌క్రైమ్ నేరగాళ్లు ఫోన్ చేసి మీ క్రెడిట్‌కార్డు లిమిట్ పెంచుతామని చెప్పారు. దీంతో ఆయన ససేమిరా అన్నాడు. రెండు రోజులు సైతం ఫోన్ చేయడంతో చివరకు ఒప్పుకున్నాడు. ఓటీపీ చెప్పడంతో ఆయన అకౌంట్‌లో ఉన్న రూ.36వేల నగదును కేటుగాళ్లు ఖాళీ చేశారు. మోసపోయినట్లు గ్రహించిన ఆయన సైబర్‌క్రైమ్ పోలీసులను ఆశ్రయించడంతో డబ్బులను హోల్డ్‌లో పెట్టారు.
- జిల్లా కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి సోషల్ మీడియాలో డబ్బులు రెట్టింపునకు సంబంధించిన పోస్టును చూశాడు. యాప్ డౌన్‌లోడ్ చేసుకున్నాడు. మొదట కొంత డబ్బులు వేయడంతో రూ.25వేల ప్రయోజనం చేకూరింది. ఆ తర్వాత మరో రెండు మూడు యాప్‌లు డౌన్‌లోడ్ చేశాడు. రూ.2లక్షలు పెట్టుబడి పెడితే రూ.70వేల లాభం వచ్చింది. ఇలా రెండు మూడు నెలల పాటు జరిగింది. అప్పు తెచ్చి, పర్సనల్ రుణాలు తీసుకొని అందులో రూ.30లక్షలు పెట్టుబడి పెట్టాడు. డబ్బులు విత్‌డ్రా చేసుకుందామని ఆ కంపెనీ వారితో మాట్లాడగా, వారు ఇతడి ఫోన్‌బ్లాక్ చేశారు. నష్టపోయినట్లు గ్రహించిన బాధితుడు లబోదిబోమంటున్నాడు.
- ఆదిలాబాద్ పట్టణంలోని తాంసి బస్టాండ్ ప్రాంతంలో గల ఓ వ్యక్తి వాట్సాప్‌కు మెసేజ్ వచ్చింది. డబ్బులు రెట్టింపు అవుతాయని చెప్పడంతో ఆయన ఆ లింక్‌ను ఓపెన్ చేశాడు. ఆరు విడతలుగా రూ.49వేలు ఆయన ఖాతాలో నుంచి డ్రా అయ్యాయి.
- ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి కూతురు హైదరాబాద్‌లో చదువుకుంటుంది. మీ కూతురు దొంగతనం కేసులో ఇరుక్కుంది. పోలీసు కేసు నమోదైందని చెప్పారు. పక్కనుంచి డాడీ అంటూ అరుపులు వచ్చాయి. దీంతో ఆయన భయపడి ఆయన కూతురుకు ఫోన్ చేయగా, ఆమె కాలేజీ నుంచి వచ్చిన తర్వాత నిద్రపోవడంతో ఫోన్ లిఫ్ట్ చేయలేదు. భయాందోళన చెందిన ఆయన మొదట రూ.1లక్ష వారి ఖాతాలో జమ చేశాడు. తర్వాత మరో రూ.20వేలు పంపించాలని చెప్పడంతో ఆయన వద్ద డబ్బులు లేకపోవడంతో మరో వ్యక్తి వద్ద డబ్బుల కోసం వెళ్లాడు. విషయం చెప్పడంతో మీరు మోసపోయారు.. ఎవరికి డబ్బులు వేయవద్దని అతడు చెప్పడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. సైబర్‌క్రైం పోలీసులు వెంటనే స్పందించి రూ.70వేలను హోల్డ్‌లో పెట్టారు.

- మాయమాటలతో బురిడీ కొట్టిస్తారు
- క్షణాల్లో బ్యాంకు ఖాతాలు ఖాళీ చేస్తారు
- జిల్లాలో పెరిగిపోతున్న సైబర్ నేరాలు
- లబోదిబోమంటున్న బాధితులు
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు



జిల్లాలో ఈ ఏడాది 186 కేసులు..

సైబర్‌క్రైమ్‌కు సంబంధించి జిల్లాలో ఈఏడాది ఇప్పటివరకు 186 కేసులు నమోదయ్యాయి. బాధితులు సకాలంలో సైబర్‌క్రైమ్ పోలీసులను ఆశ్రయించడంతో 45 కేసులకు సంబంధించి డబ్బులను హోల్డ్‌లో పెట్టి ఇప్పించారు. మరో 45 కేసులకు సంబంధించి డబ్బులు ఇప్పించాల్సి ఉంది. రూ.25వేల లోపు మోసపోయిన బాధితులు 44 మంది ఉన్నారు. అలాగే రూ.25వేల పైనుంచి లక్షలు పోగొట్టుకున్నవారు 33 మంది ఉండగా, ఎఫ్ఐఆర్ నమోదు చేసి హోల్డ్‌లో పెట్టారు. వీటితో పాటు సోషల్ మీడియాలో అసభ్యపదజాలంతో దూషించడం, వివిధ కారణాలతో ఇబ్బందులకు గురిచేసిన కేసులు 15 నమోదైనట్లు సైబర్‌క్రైమ్ పోలీసులు చెబుతున్నారు.

ఆదిలాబాద్‌టౌన్: మనం వాడే స్మార్ట్‌ఫోన్, లాప్‌టాప్, డెస్క్‌టాప్ ఇలా ఏదైనా సరే మనల్ని ఏమార్చి కొల్లగొట్టేందుకు సైబర్ నేరగాళ్లు ప్రతిచోటా మాటు వేసి ఉంటున్నారు. ప్రతిరోజు జిల్లాలో ఎక్కడో ఒక చోట వారి ఉచ్చులో పడి మోసపోతూనే ఉన్నారు. డబ్బులు పోగొట్టుకుంటున్న తర్వాత లబోదిబోమంటూ బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఇందులో విద్యావంతులే అధికంగా ఉండటం గమనార్హం. లింక్‌లు ఓపెన్ చేయడం, తర్వాత ఓటీపీలు చెప్పడంతో మోసగాళ్లు వారి పని సులువుగా కానిచ్చేస్తున్నారు. ఇటీవల ఈ కేటుగాళ్లు రూటు మార్చారు. పోలీసులమని చెప్పి బెదిరింపులకు పాల్పడి అందినకాడికి దండుకుంటున్నారు. ఇలాంటి వారి విషయంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

అందినకాడికి దోచుకుంటున్నారు..

జిల్లాలో కేటుగాళ్ల రోజురోజుకు రెచ్చిపోతూ అందినకాడికి దోచుకుంటున్నారు. ఇటీవల క్రెడిట్ కార్డు లిమిట్ పెంచాలని, మీకు డ్రాతగిలిందని నమ్మబలికి ఓటీపీ చెప్పేలా చేస్తున్నారు. అలాగే మీ పిల్లలు మత్తు పదార్థాల కేసుల్లో ఇరుక్కుపోయారని, పోలీసులమని బెదిరింపులకు పాల్పడుతూ బాధితుల ఖాతాల్లోంచి డబ్బులు మాయం చేస్తున్నారు.

ఇలా కూడా మోసాలు..

- రుణమాఫీ అయిన రైతులకు లింకులు పంపుతున్నారు. వాటిని ఓపెన్ చేస్తే డబ్బులు మాయం అవుతున్నాయి.
- మీ పిల్లలు డ్రగ్స్, దొంగతనం కేసుల్లో ఇరుక్కుపోయారు. వీడియో కాల్ చేయండి చూపిస్తామని చెప్పి పక్క నుంచి అరుపులు, ఏడ్పులు వినిపిస్తారు. వీడియో కాల్ చేసిన తర్వాత యూనిఫాం వేసుకొని మాట్లాడతారు. ఎఫ్ఐఆర్ కాపీని వాట్సాప్‌కు పంపి కేసు అయ్యిందని నమ్మిస్తారు. డబ్బులు వేస్తే విడిచిపెడతామని బెదిరిస్తారు.
- వర్క్‌ఫ్రమ్ హోమ్ పేరిట జాబ్ ఉందని చెబుతారు. ఒకనెల వేతనం పంపించి నమ్మిస్తారు. దీంతో వారు స్నేహితులకు కూడా జాబ్ ఉందని చెబుతారు. అయితే వారి నుంచి రూ.వేలల్లో మోసగాళ్లు వారి ఖాతాల్లో వేయించుకొని నంబర్ బ్లాక్ చేసి ఉడాయిస్తారు.



సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దు..

ఫోన్‌కు వచ్చే గుర్తు తెలియని లింకులు, మెస్సేజ్‌లకు స్పందించవద్దు. జిల్లాలో ఇటీవల చాలా మంది సైబర్ కేటుగాళ్ల చేతిలో మోసపోతున్నారు. డబ్బులు పోగొట్టుకున్న వెంటనే టోల్‌ఫ్రీ నం.1930కు సమాచారం అందించాలి. www. cybercrime. com కు ఫిర్యాదు చేయాలి. నేరగాళ్లు పోలీసులమని చెబుతూ బెదిరింపులకు కూడా పాల్పడుతున్నారు. అలాంటిదేమైనా ఉంటే వెంటనే పోలీసులను ఆశ్రయించాలి. ఫోన్లకు వచ్చే ఓటీపీలను అపరిచిత వ్యక్తులతో పంచుకోవద్దు. – **హసీబుల్లా, డీఎస్పీ, సైబర్‌క్రైమ్**

డ్రగ్ తీసుకుంటున్నారా..
తస్మాత్ జాగ్రత్త

- యూరిన్ టెస్ట్ ద్వారా నిర్ధారణ
- జిల్లాలో మొదటి కేసు నమోదు



గంజాయి విక్రయదారుడితో పోలీసులు

ఆదిలాబాద్‌టౌన్: డ్రగ్, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు సేవించే వారు తస్మాత్ జాగ్రత్త అంటూ పోలీసులు హెచ్చరిస్తున్నారు. వారి వద్ద మత్తు పదార్థాలు లభించకపోయినా అనుమానం వచ్చి యూరిన్ ద్వారా డ్రగ్ టెస్ట్ చేసినప్పుడు నిర్ధారణ అయితే కేసు నమోదు చేస్తున్నారు. జిల్లాలో ఆదివారం ఇలా మొదటి కేసు నమోదైనట్లు డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని క్రాంతినగర్‌కు చెందిన షేక్ శన్న అలియాస్ మోసిన్ ఆదివారం రిమ్స్ పక్కన గంజాయి విక్రయించేందుకు వేచి ఉన్నాడు. టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాశ్‌ను చూసి గంజాయిని పారేసి పరారయ్యాడు. దీంతో అతడికి యూరిన్ పరీక్ష చేయగా పాజిటీవ్‌గా నిర్ధారణ అయ్యింది. ఆ వ్యక్తి శనివారం గంజాయి సేవించినా పరీక్ష చేయడంతో నిర్ధారణ అయిందని, దీంతో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అతడు 60 గ్రాముల గంజాయిని పారవేయగా, ఆ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. డ్రగ్‌కు అలవాటుపడిన వారు మానుకోవాలని సూచించారు. గంజాయి, మత్తు పదార్థాలతో విలువైన జీవితాలు నాశనం అవుతాయని డీఎస్పీ పేర్కొన్నారు. ఎస్పీ గౌస్ ఆలం జిల్లాకు ప్రత్యేకంగా డ్రగ్ నిర్ధారణ కోసం యూరిన్ కిట్లను తెప్పించారని వివరించారు. డ్రగ్ సేవించిన మూడు నాలుగు రోజుల తర్వాత కూడా ఈ కిట్ల ద్వారా నిర్ధారణ అవుతుందని తెలిపారు.



డ్రగ్ నిర్ధారించే యూరిన్ టెస్ట్ కిట్

టీచర్ల సర్దుబాటు రెడీ

- జిల్లాలో 131 మందిని అవసరమున్న బడులకు..
- ఎంఈవోల వద్ద జాబితా.. రేపు కేటాయింపు
- డీఎస్సీ నియామకాల వరకు కొనసాగింపు



మావలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

జిల్లాలో ..

మొత్తం ఉపాధ్యాయ పోస్టులు	3,004
ప్రస్తుతం పనిచేస్తున్న టీచర్లు	2,349
ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు	655
ఒక్క టీచర్ కూడా లేని పాఠశాలలు	18
ఏకోపాధ్యాయ పాఠశాలలు	85
విద్యార్థుల సంఖ్య లేక మూతబడ్డ పాఠశాలలు	10

ఆదిలాబాద్‌టౌన్: సర్కారు బడుల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. జిల్లాలో ఉపాధ్యాయులు ఉన్నచోట విద్యార్థుల సంఖ్య లేదు.. విద్యార్థులు ఉన్నచోట సరిపడా టీచర్లు లేని పరిస్థితి. ఇప్పటికే ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి ఆన్‌లైన్ ద్వారా పరీక్ష నిర్వహించింది. ఫలితాలు రావాల్సి ఉంది. నియామకాలకు మరో రెండు నెలలు పట్టే అవకాశం ఉండడంతో అప్పటివరకు అవసరానికి మించి ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలల నుంచి అవసరం ఉన్న బడులకు సర్దుబాటు చేసేలా చర్యలు చేపడుతున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు విద్యాశాఖ అధికారులు సర్దుబాటు జాబితా సిద్ధం చేశారు. ఈనెల 27న జాబితా విడుదల కానున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

సర్దుబాటుకు రెడీ..

ఉపాధ్యాయులు లేక సతమతమవుతున్న పాఠశాలలకు ఎట్టకేలకు బోధకులను నియమించేలా యంత్రాంగం తాత్కాలిక చర్యలకు శ్రీకారం చుట్టింది. జిల్లాలో 392 మంది టీచర్లు అవసరం ఉన్నట్లు విద్యాశాఖ గుర్తించింది. దీంతోపాటు జిల్లాలో 131మంది ఆయా పాఠశాలల్లో సర్‌ప్లస్ ఉపాధ్యాయులు ఉన్నట్లు నిర్ధారించారు. జిల్లాలోని ఆయా మండలాల ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయుల నుంచి వివరాలను సేకరించారు. డీఈవో కార్యాలయానికి సమర్పించారు. ఎస్జీటీల సర్దుబాటుకు సంబంధించి జాబితా సిద్ధమైంది. కాగా స్కూల్ అసిస్టెంట్లకు సంబంధించి జాబితా కూడా సిద్ధమవుతుంది. మంగళవారం సర్దుబాటు అయిన ఉపాధ్యాయులకు సంబంధించిన ఉత్తర్వులు విడుదల చేయనున్నారు. ఆయా మండలాల పరిధిలోని ఉపాధ్యాయులను అవసరమున్నచోట సర్దుబాటు చేసిన తర్వాత మిగిలిన వారిని పక్క మండలాలకు సర్దుబాటు చేస్తారు. అయితే జిల్లాలో ఉర్దూ మీడియం బోధించే ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. అవసరానికి మించి ఉన్న వారిని జిల్లాలోని ఆయా పాఠశాలలకు కేటాయించనున్నారు. ఇప్పటికే కొంత మంది ఉపాధ్యాయ సంఘ నాయకులతో తమకు నచ్చిన పాఠశాలల కోసం పైరవీలు చేయిస్తున్నట్లు తెలుస్తోంది.

131 మంది సర్దుబాటు..

జిల్లాలోని ఆయా మండలాల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కంటే 92 ఎస్జీటీ పోస్టులు అధికంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అలాగే స్కూల్ అసిస్టెంట్ గణితంలో 5, సాంఘిక శాస్త్రంలో 5, తెలుగులో 4, హిందీలో 2, ఇంగ్లీష్‌లో 5, మరాఠీలో 1, ఫిజికల్ సైన్స్‌లో 10, బయోసైన్స్‌లో 7 కలిపి మొత్తం 131 పోస్టులను సర్దుబాటు చేయనున్నారు.

సర్కారు బడుల్లో తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య..

ప్రభుత్వ పాఠశాలల్లో రోజురోజుకు విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం పడుతోంది. చాలా ప్రాథమిక పాఠశాలల్లో పది నుంచి 25 లోపే ఉంటుంది. కొంత మంది ఉపాధ్యాయులు తమ పోస్టులు వెళ్లిపోకుండా విద్యార్థులు లేకపోయినప్పటికీ సంఖ్య పెంచి చూపిస్తున్నారు. ఒకవేళ రేషనలైజేషన్ చేస్తే ఆయా పాఠశాలల్లో చాలా పోస్టులు తగ్గిపోయే పరిస్థితి ఉంది. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం కొంత మంది ఉపాధ్యాయులు పట్టించుకోకపోవడంతో ఇలాంటి పరిస్థితులు ఎదురవుతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

సర్దుబాటు చేపడుతున్నాం..

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో సర్దుబాటు ప్రక్రియ చేపడుతున్నాం. జిల్లాలో విద్యార్థుల సంఖ్య కంటే అదనంగా ఉన్న పోస్టులను గుర్తించాం. 131 మంది టీచర్లను అవసరం ఉన్న పాఠశాలలకు తాత్కాలికంగా పంపించే ఏర్పాట్లు చేస్తున్నాం. 392 అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుల కోసం ముఖ్య కార్యదర్శికి కలెక్టర్ లేఖ రాశారు. విద్యార్థుల చదువులకు ఆటంకం కలగకుండా చర్యలు చేపడుతున్నాం. – **ప్రణీత, డీఈవో**

ఇంకెన్నాళ్లు..!

- 'పీఎం విశ్వకర్మ' లబ్ధిదారుల ఎంపికలో తీవ్ర జాప్యం
- జిల్లాలో దరఖాస్తులు 7,738.. ఇప్పటి వరకు పరిశీలించినవి 2,261
- ఏడాది కావస్తున్నా సగం పరిశీలన కూడా పూర్తికాని వైనం
- అర్హులకు తప్పని ఎదురుచూపులు

కైలాస్‌నగర్: ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం కింద లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జిల్లాలో నత్తనడకన సాగుతోంది. దరఖాస్తులు స్వీకరించి దాదాపు ఏడాది కావస్తున్నా వాటి పరిశీలన ప్రక్రియ ఇంకా పూర్తి కాకపోవడం గమనార్హం. క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన వారిని ఎంపిక చేయాల్సిన పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. పరిశీలనకే ఏడాది గడిస్తే ఎంపిక, శిక్షణ, రుణాల మంజూరుకు ఇంకెంత సమయం పడుతుందనే అభిప్రాయం దరఖాస్తుదారుల్లో వ్యక్తమవుతుంది.

ఉద్దేశమేంటంటే

కులవృత్తులు, చేతివృత్తులపై ఆధారపడి జీవించే వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని ప్రవేశ పెట్టింది. ఈ పథకం కింద ఎంపికైన వారికి వృత్తి నైపుణ్య శిక్షణతో పాటు అధునాతన వృత్తి పరికరాల కొనుగోలు కోసం రూ.15వేల ఆర్థికసాయం అందిస్తారు. దీంతో పాటు రూ.1లక్ష రుణం మంజూరు చేస్తారు. ఈ పథకాన్ని ప్రధాని నరేంద్రమోదీ గతేడాది సెప్టెంబర్ 17న ప్రారంభించారు. జిల్లాలో అధికారులు అదే నెలలో అర్హులైన వారి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా 7,738 దరఖాస్తులు అందినట్లు అధికారులు వెల్లడించారు. వీటిని గ్రామీణ ప్రాంతాల్లోనైతే పంచాయతీ కార్యదర్శులు, పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన వారిని ఆన్‌లైన్‌లోనే సిఫారసు చేయడం, అనర్హులైతే రిజెక్ట్ చేయాల్సి ఉంటుంది.

నత్తనడకన క్షేత్రస్థాయి పరిశీలన

జిల్లాలో పీఎం విశ్వకర్మ దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన నత్తనడకన సాగుతోంది. ఏడాది వ్యవధిలో స్టేజ్–1 అధికారులైన పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ అధికారులు 2,261 దరఖాస్తులను మాత్రమే పరిశీలించారు. ఇందులో 1,358 దరఖాస్తులను అర్హులుగా పరిగణిస్తూ స్టేజ్–2 (కలెక్టర్ లాగిన్)అధికారికి పంపించారు. వాటిని పరిశీలించిన కలెక్టర్ 615 దరఖాస్తులను స్టేజ్–3(రాష్ట్రస్థాయికి) నివేదించారు. జిల్లాలో ఇంకా స్టేజ్–1లో 5,432, స్టేజ్–2లో 903 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. అయితే ఇటీవల జరిగిన బదిలీల్లో జిల్లాలో చాలామంది పంచాయతీ కార్యదర్శులు ఇతర జీపీలకు బదిలీపై వెళ్లారు. మున్సిపల్ అధికారులు సైతం మారారు. కొత్తగా వచ్చిన వారు ఈ దరఖాస్తులను పరిశీలించాలంటే వారికి ప్రత్యేకంగా లాగిన్ క్రియేట్ చేయాల్సి ఉంటుంది. ఈ లెక్కన దరఖాస్తుల పరిశీలనకు మరింత సమయం పట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే త్వరితగతిన పరిశీలన ప్రక్రియ పూర్తిచేసి అర్హులైన వారిని ఎంపిక చేస్తే ప్రయోజనకరంగా ఉంటుందని పలువురు దరఖాస్తుదారులు పేర్కొంటున్నారు.

ఎన్నికలు, బదిలీల కారణంగా జాప్యం

అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు వరుసగా రావడంతో దరఖాస్తుల పరిశీలనకు బ్రేక్ పడింది. దీనికి తోడు ఇటీవల జరిగిన బదిలీలతో పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ అధికారులు ఇతర చోటుకు బదిలీ అయి వారి స్థానాల్లో కొత్త వారు వచ్చారు. ఈ కారణంగా దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ కొంత జాప్యం అయింది. ఆదివారం సెలవురోజైనప్పటికీ జిల్లాలోని మండల పంచాయతీ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పరిశీలన ప్రక్రియ వేగవంతంపై సూచనలు చేశాం.
– **పద్మభూషణ్‌రాజు, జిల్లా పరిశ్రమలశాఖ జీఎం**



జలపాతం అందాలను వీక్షిస్తున్న పర్యాటకులు

సండే.. సందడి

నేరడిగొండ మండలంలోని కుంటాల జలపాతం ఆదివారం పర్యాటకులతో సందడిగా మారింది. సెలవు రోజు కావడంతో ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా సుదూర ప్రాంతాల నుంచి సైతం భారీగా తరలివచ్చారు. జలసోయగాలను వీక్షించి మంత్రముగ్ధులయ్యారు. పాలనురుగులా పారుతున్న జలధారలను సెల్‌ఫోన్లలో బంధించారు.
– నేరడిగొండ

'జోగు రామన్న విమర్శలు హాస్యాస్పదం'



మాట్లాడుతున్న భోజారెడ్డి

కైలాస్‌నగర్: పార్టీ మార్పు విషయమై బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న తమను విమర్శించడం హాస్యాస్పదంగా ఉందని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. స్థానిక ప్రజాసేవభవన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నాడు టీడీపీ ఉనికి కోల్పోతుందని గ్రహించి ఉద్యమముసుగులో కేసీఆర్‌తో కోట్ల రూపాయల ఒప్పందం మాట్లాడుకుని బీఆర్ఎస్‌లో చేరిన జోగు రామన్న పార్టీ మార్పు గురించి తమను విమర్శించడమంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. స్వార్థం కోసం పార్టీ మారిన జోగు రామన్నకు తమను విమర్శించే అర్హత లేదని ధ్వజమెత్తారు. రామన్న, ఆయన చెంచాలు రుణమాఫీపై రైతులను ఉసిగొలిపి, ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేలా లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని వారికి హితవు పలికారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2లక్షల్లోపు రుణాలను మాఫీ చేసిందన్నారు. సమావేశంలో నాయకులు సంతోష్, ప్రవీణ్‌రెడ్డి, శ్రీలేఖ, వెంకట్‌రెడ్డి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైన్స్‌లో చోరీ



దొంగలు ధ్వంసం చేసిన వైన్స్ షట్టర్

నేరడిగొండ: మండల కేంద్రంలోని వరుణ్ లిక్కర్ మార్ట్ వైన్స్‌లో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని దుండగులు వైన్స్ షట్టర్ పగులగొట్టి లోనికి చొరబడి మందు బాటిళ్లు, రూ.1.50 లక్షల నగదు ఎత్తుకెళ్లినట్లు వైన్స్ నిర్వాహకుడు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు. దొంగలు ఎత్తికెళ్లిన మందు బాటిళ్ల అట్టపెట్టెలు వైన్స్ సమీపంలో పడేసినట్లు పోలీసులు గుర్తించారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా



ప్రాజెక్టులో బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

కడెం: కడెం ప్రాజెక్ట్ పరిసరాలు ఆదివారం పర్యాటకులతో సందడిగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు ప్రాజెక్ట్ అందాలను తిలకించారు. కుటుంబ సభ్యులు, మిత్రులతో కలిసి ప్రాజెక్టులో బోటింగ్ చేసి ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు.

భర్త ఇంటి ఎదుట భార్య దీక్ష

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని శాంతినగర్ కాలనీలో అద్దె ఇంట్లో ఉంటున్న ఓ ఉపాధ్యాయుడి భార్య తనను కాపురానికి తీసుకువెళ్లడం లేదని కుటుంబ సభ్యులతో కలిసి భర్త ఇంటి ఎదుట ఆదివారం దీక్ష చేపట్టింది. కోర్టు తీర్పు వచ్చి నెలైనా తనను తీసుకువెళ్లడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. తనకు న్యాయం చేయాలని కోరింది.

కుక్కల దాడిలో జింకకు గాయాలు



గాయపడ్డ జింకతో గ్రామస్తులు

కుభీర్: మండలంలోని చొండి పరిసరాల్లో ఆదివారం మధ్యాహ్నం కృష్ణజింకను కుక్కలు వెంబడించాయి. అది పరిగెత్తుకుని గ్రామంలోకి వచ్చింది. వెంటనే గణేశ్, శ్రీకాంత్ అనే యువకులు జింకను కుక్కలను నుంచి కాపాడి అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీ అధికారి కరీమ్ వచ్చి జింకను రేంజ్ కార్యాలయానికి తీసుకెళ్లారు. కుక్కలు కరవడంతో జింక రెండు కాళ్లకు గాయాలయ్యాయి. మాజీ ఎంపీటీసీ రాందాస్, గ్రామస్తులున్నారు.

దేశీదారు పట్టివేత



దేశీదారు బాటిళ్లతో పోలీసులు

కుభీర్: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న బెల్ట్‌షాపులపై ఆదివారం దాడి చేసి ఎం.విఠల్ వద్ద 4.14లీటర్ల దేశీదారు పట్టుకున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు. దీని విలువ రూ.1,640 ఉంటుందని పేర్కొన్నారు. విఠల్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వంట గ్యాస్ సిలిండర్ల చోరీ

ఖానాపూర్: పట్టణంలోని విద్యానగర్ కాలనీలో నివాసముంటున్న ప్రైవేట్ ఉపాధ్యాయుడు శంకర్ ఇంట్లోని ఒక ఖాళీ సిలిండర్, ఒక నిండు సిలిండర్‌ను ఆదివారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

విద్యార్థులకు చేయూత

- సేవా కార్యక్రమాల్లో పలువురు
- జిల్లాలో ఏటా స్టడీ మెటీరియల్ పంపిణీ

తాంసి: హైదరాబాద్‌కు చెందిన సంగిశెట్టి బాబు తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం గత ఆరేళ్లుగా ఆదిలాబాద్ జిల్లాలో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ప్రతియేటా రూ.5లక్షలకు పైగా విలువైన స్టడీ మెటీరియల్, స్టీల్ బాటిళ్లు పంపిణీ చేస్తున్నారు. బాబు తండ్రి శంకరయ్య 2005లో, తల్లి యాదమ్మ 2015లో మృతిచెందగా వారి స్మారకార్థం సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని యాదశంకర మెమొరియల్ ఫౌండేషన్ ఏర్పాటు చేశారు. ఇప్పటికే జిల్లాలోని తాంసి, తలమడుగు, భీంపూర్ మండలాల్లోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బ్యాగులు, పెన్నులు, తరగతుల వారీగా నోట్‌పుస్తకాలు, పరీక్ష ప్యాడ్‌లు అందజేశారు. ఈ ఏడాది విద్యార్థులకు తాంసి, తలమడుగు పాఠశాల్లో విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిళ్లు, 9వ, 10వ తరగతి విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్ డిక్షనరీలు అందించారు. విద్యార్థులు చదువులో రాణించేలా ప్రోత్సాహం అందిస్తున్నామని ట్రస్టు చైర్మన్ బాబు తెలిపారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



పంపిణీ చేసిన బాటిళ్లు, స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు, ఫౌండేషన్ చైర్మన్ బాబు

తాంసి మండలం కప్పర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు విలాస్‌గౌడ్ ప్రతియేటా విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్నారు. విలాస్‌గౌడ్ భార్య కృష్ణకుమారి తలమడుగు మండలం ఖోడద్ పాఠశాలలో ఉపాధ్యాయినిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ దంపతులు తమ వంతు సాయంగా ప్రతియేటా రూ.2లక్షల విలువైన స్టడీ మెటీరీయల్ విద్యార్థులకు అందిస్తున్నారు. జిల్లాలోని మారుమూల గిరిజన గ్రామాల్లో ఉన్న పాఠశాల విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు, నోట్‌బుక్‌లు, పెన్సిల్, ఇతర సామగ్రి కిట్‌గా తయారు చేసి పంపిణీ చేస్తున్నారు. గత సంవత్సరం జిల్లాలోని 3100 మంది మారుమూల గ్రామాల్లో ఉన్న విద్యార్థులకు వస్తువులు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రోత్సహించడంలో భాగంగా స్టడీ మెటీరియల్ అందజేస్తున్నట్లు ఉపాధ్యాయ దంపతులు తెలిపారు.



పాఠశాల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను అందజేస్తున్న ఉపాధ్యాయుడు విలాస్ గౌడ్



ట్రస్ట్ తరఫున ఇచ్చిన బ్యాగులతో విద్యార్థులు

సమనుజ్ఞ ట్రస్ట్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన విశ్వనాథ్ అడ్వకేట్ పేదలకు సాయం చేయాలని మూడేళ్ల క్రితం సమనుజ్ఞ ట్రస్ట్ ఏర్పాటు చేశారు. పిల్లలకు విద్యతోపాటు ఆరోగ్యమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. మూడేళ్లుగా జిల్లాలోని మారుమూల ఉన్న గిరిజన గ్రామాల్లోని పాఠశాల విద్యార్థులకు బ్యాగులు, స్టడీమెటీరియల్ అందిస్తున్నారు. ట్రస్ట్ ద్వారా ఇప్పటికే రెండు వేలకు పైగా విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ ఏడాది ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు డెస్క్, బ్యాగులు పంపిణీ చేస్తున్నారు. ప్రత్యేకంగా తయారు చేయించిన బ్యాగులతోపాటు పెన్నులు, నోట్‌బుక్‌లు అందిస్తున్నారు. ఇప్పటికే గుబిడిపల్లి పాఠశాలలో విద్యార్థులకు డెస్క్ బ్యాగులు పంపిణీ చేయగా పాఠశాల విద్యార్థులకు ఉపయోగించుకుంటున్నారు. ఈ ఏడాది జిల్లాలోని మారుమూల పాఠశాలల్లోని 500మందికి పైగా డెస్క్ బ్యాగులు అందజేసే విధంగా ప్రణాళికతో ముందుకెళ్తున్నట్లు విశ్వనాథ్ తెలిపారు.

వాగులు దాటి.. మరమ్మతులు చేసి



వాగు దాటి వెళ్తున్న సిబ్బంది గంగన్న, సురేందర్



విరిగిపడ్డ చెట్టు



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది



తెగిన విద్యుత్ లైన్

నిర్మల్ జిల్లా కడెం మండలంలో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో మండలంలోని ఉడుంపూర్ సమీపంలోని అటవీ ప్రాంతంలో భారీ వృక్షం విద్యుత్ లైన్‌పై పడింది. దీంతో మూడు స్తంభాల పరిధిలోని విద్యుత్ తీగలు తెగిపోయాయి. ఉడుంపూర్‌తోపాటు పరిసర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సమాచారం అందుకున్న విద్యుత్ సిబ్బంది గంగన్న, సురేందర్ ఆదివారం ఉదయం అటవీ ప్రాంతంలో వాగులు దాటి వెళ్లి విద్యుత్ లైనుకు మరమ్మతులు చేపట్టారు. సాయంత్రానికల్లా సరఫరా పునరుద్ధరించారు. - కడెం

పంటల క్షేత్ర ప్రదర్శన



పత్తి క్షేత్ర ప్రదర్శనలో కేవీకే శాస్త్రవేత్తలు

ఎదులాపురం: జైనథ్ మండలం జైనథ్, నిరాల గ్రామాల్లో గల పత్తి, సోయా, కంది పంట క్షేత్రాల్లో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రాజశేఖర్, శివచరణ్ ఆదివారం క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం పత్తి పూత దశలో ఉందని, రసం పీల్చే పురుగులైన పచ్చదోమ, తెల్లదోమ ఆశించడం గుర్తించినట్లు పేర్కొన్నారు. నివారణకు ఫ్లోనికమిడ్ 60 గ్రాములు లేని పక్షంలో డైనటోఫెరాన్ 60 గ్రాములు లేని పక్షంలో ఎసిటమ్రిడ్+డైయపెందురాన్ 100 గ్రాములు లేదా డైయంఫెందురాన్+ఖైఫెంత్రాన్ 250 మిల్లీ లీటర్లు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. అలాగే పత్తిలో ఆకుమచ్చల నివారణకు ప్రొపికొనాజోల్ 200 మిల్లీ లీటర్లు లేదా హెక్సాకొనాజోల్ 400 మిల్లీ లీటర్లు లేదా టెబుకొనజోల్ 200 మిల్లీ లీటర్లు లీటర్ నీటికి ఎకరానికి పిచికారీ చేసుకోవాలని తెలిపారు. సోయాబీన్ కాత దశలో ఉందని, కాండపు తొలుచు పురుగు, కాండపు ఈగ ఆశించినట్లు గుర్తించామన్నారు. దీని నివారణకు ఇసోసైక్లోసోరమ్ 240 మిల్లీ లీటర్లు లేదా క్లోరంత్రనిలిప్రోల్ 60 మిల్లీ లీటర్లు లేదా థయోమిక్సామ్+లామ్డాసైహాలోత్రిన్ 50 మిల్లీ లీటర్లు ఎకరానికి పిచికారీ చేసుకోవాలని సూచించారు. కందిలో ఎండుతెగులు నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని తెలిపారు.

నిర్మల్ కవులకు పురస్కారాలు



పోలీస్ భీమేశ్



తుమ్మల దేవరావు



తొడిశెట్టి పరమేశ్వర్



నేరేళ్ల హనుమంతు

నిర్మల్‌ఖిల్లా: తెలుగు వ్యవహారిక భాషోద్యమ పితామహుడు, ప్రముఖ సాహితీవేత్త గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా ఏటా ఇచ్చే గిడుగు జాతీయ సాహితీ కళా, సేవారంగాల పురస్కారాలను నిర్మల్ జిల్లాకు చెందిన నలుగురు కవులు దక్కించుకున్నారు. జిల్లాకేంద్రానికి చెందిన పోలీస్ భీమేశ్‌కు 'స్వేచ్ఛకు సంకెళ్లు' అనే కవితా సంపుటికి, తుమ్మల దేవరావుకు 'మట్టి పాదాలు' కవితా గ్రంథానికి వేర్వేరుగా 'గిడుగు జాతీయ సాహితీ పురస్కారం' దక్కింది. సాహితీ, కళా, సేవారంగాల్లో చేస్తున్న సేవలకు గాను తొడిశెట్టి పరమేశ్వర్‌కు, సేవారంగంలో అందిస్తున్న సేవలకు గాను నేరేళ్ల హనుమంతుకు 'గిడుగు జాతీయ సాహితీ సేవారంగ పురస్కారా'లు లభించాయి. గిడుగు రామ్మూర్తి పంతులు ఫౌండేషన్, నవ్యాంధ్ర రచయితల సంఘం సంయుక్తగా నిర్వహించనున్న జాతీయ సాహితీ పురస్కారాల ప్రదాన కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ నగరంలోగల ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఈనెల 29న ఉంటుందని పురస్కార గ్రహీతలకు సమాచారమందించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రతిష్టాత్మకమైన గిడుగు పురస్కారాలకు నిర్మల్ జిల్లాకు చెందిన నలుగురు ఏకకాలంలో ఎంపిక కావడంపై జిల్లాకు చెందిన పలువురు కవులు, కళాకారులు, రచయితలు అభినందనలు తెలిపారు.

తండ్రి మరణం తట్టుకోలేక తనయుడి మృతి



జాహూర్ అలీఖాన్, అబిద్ అలీఖాన్ (ఫైల్)

నిర్మల్‌టౌన్: తండ్రి మరణం తట్టుకోలేక కొడుకు మృతి చెందిన ఘటన నిర్మల్ జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. నిర్మల్ పట్టణంలోని ఆస్ర కాలనీకి చెందిన రిటైర్డ్ వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగి జాహూర్ అలీఖాన్ (74) అనారోగ్యంతో ఆదివారం ఉదయం ఇంట్లోనే మరణించాడు. తండ్రి మరణించిన విషయాన్ని ఆయన కుమారుడు అబిద్ అలీఖాన్(50) బంధువులకు, మిత్రులకు ఫోన్ చేసి సమాచారం అందించాడు. ఈ క్రమంలో అతను ఒక్కసారిగా కుప్పకూలాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించేలోగా మృతి చెందాడు. అబిద్ అలీఖాన్ టింబర్ డిపో నడుపుతున్నాడు. ఒకే రోజు తండ్రి, కొడుకు మృతి చెందడంతో వారి కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

సంతానం కావడంలేదని ఆత్మహత్య

ఇంద్రవెల్లి: వివాహమై పదేళ్లయినా సంతానం కలగడంలేదని మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై సునీల్, బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పిట్టబొంగరం గ్రామానికి చెందిన చహకటి జంగుబాపు (30)కు పదేళ్ల క్రితం ఇచ్చోడ మండలంలోని దాబా గ్రామానికి చెందిన సీతాబాయితో వివాహమైంది. సంతానం కలగపోవడంతో పలు ఆస్పత్రులు తిరిగినా ఫలితం లేకపోయింది. దీంతో నాలుగు నెలలుగా జంగుబాపు మద్యానికి బానిస కాగా, భార్య సీతాబాయి మూడు నెలల క్రితం పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో శనివారం ఉదయం తాగిన మైకంలో వ్యవసాయ చేనుకు వెళ్లి జంగుబాపు పురుగుల మందు తాగాడు. సమీప రైతులు, కుటుంబ సభ్యులు 108లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించగా చిక్సిత పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి అన్న జగ్గెరావ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చెస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దవాఖానాలో చెట్లు నరికివేత

ముథోల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలోని చెట్లను ఆదివారం నరికివేయగా గ్రామ యువకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చెట్లు నరికిన విషయాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా చెట్లు నరకడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బాసరలో భక్తుల రద్దీ



పిల్లలకు అక్షర శ్రీకారం చేయిస్తున్న తల్లిదండ్రులు

బాసర: ఆది, సోమవారాలు వరుసగా సెలవులు రావడంతో నిర్మల్ జిల్లా బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. శ్రావణమాసం ఆదివారం తల్లిదండ్రులు తమ చిన్నారులకు ఆలయ అర్చకులతో అక్షర శ్రీకారం, కుమార్చన పూజలు చేయించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్ పాఠక్ భక్తులకు అమ్మవారి హారతి, తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అమ్మవారి దర్శనానికి గంట సమయం పట్టిందని అధికారులు వెల్లడించారు.

బైక్ అదుపు తప్పి ఒకరికి గాయాలు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని చాందా (టీ) సమీపంలో ఆదివారం బైక్ అదుపు తప్పి ఆదిలాబాద్ పట్టణంలోని కొలిపురాకు చెందిన కారింగుల పోతలింగుకు గాయాలైనట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. పోతలింగు బైక్‌పై తలమడుగు గ్రామానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు పేర్కొన్నారు. అతడిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుట్కా పట్టివేత

బోథ్: మండలంలోని పలు గ్రామాలకు గుట్కా సరఫరా చేస్తున్న ఇచ్చోడ మండలానికి చెందిన షేక్ షాజీద్‌ను ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం.. పలు గ్రామాలకు గుట్కా సరఫరా చేస్తున్నాడన్న సమాచారం మేరకు కనుగుట్ట గ్రామ సమీపంలో షేక్ షాజీద్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అతడి నుంచి రూ.27,611 విలువైన గుట్కా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

అ'పూర్వ'ం.. విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2005–06 సంవత్సరంలో 10వ తరగతి చదివినవారంతా ఇదే పాఠశాలలో ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం పేరిట కలుసుకున్నారు. 18 ఏళ్ల తర్వాత కలుసుకున్న స్నేహితులంతా ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఒకరి యోగక్షేమాలు ఒకరు తెలుసుకున్నారు. పాఠశాలలో చదివిన జ్ఞాపకాలను గుర్తు చేసుకుని రోజంతా సందడి చేశారు. గురువులను సన్మానించారు. ఉపాధ్యాయులు లింగారెడ్డి, వెంకటరమణ, రాఘవరెడ్డి, అనుపమ, వినోద్‌కుమార్, సుభాష్, వర్మ, శ్రీనివాస్, లింగన్న, వేణు, రాజేశ్వర్ తదితరులున్నారు.

అనాథ పిల్లలను ఆదుకుంటాం



పిల్లల వివరాలు తెలుసుకుంటున్న అధికారులు



చిన్నారికి పాలు తాగిస్తున్న ఆత్రం సుగుణ

ఇంద్రవెల్లి: తల్లిని కోల్పోయి అనాథలైన కవల పిల్లలను అన్ని విధాలా ఆదుకుంటామని జిల్లా బాలల సంరక్షణ కేంద్రం అధికారి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని అందునాయక్‌తండాలో శనివారం కవల పిల్లలకు జన్మనిచ్చి తల్లి మృతి చెందగా.. విషయం తెలుసుకున్న జిల్లా బాలల సంరక్షణ కేంద్రం అధికారులు ఆదివారం అందునాయక్ తండాను సందర్శించారు. పిల్లల ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. పిల్లలను కేంద్రానికి అప్పగిస్తే అన్ని విధాలా ఆదుకుంటామని కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. తన భార్య దీక్ష కర్మకాండల వరకు ఉంచి ఆ తర్వాత కేంద్రానికి అందజేస్తానని, అప్పటివరకు తమ పిల్లల బాగోగులు తామే చూసుకుంటామని అధికారులకు తండ్రి గోవింద్ లేఖ రాసిచ్చారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. తల్లి, దండ్రులను కోల్పోయి అనాథలైన ప్రతీ చిన్నారిని ఆదుకోవడానికి బాలల సంరక్షణ కేంద్రం సిద్ధంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది అనిల్ ఉన్నారు.

చిన్నారులను ఆదుకుంటాం

అందునాయక్‌తండాలో బాలింత మృతితో తల్లిని కోల్పోయిన చిన్నారులను ఆదుకోవడానికి తనవంతు కృషి చేస్తానని కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ హామీ ఇచ్చారు. ఆదివారం ఆమె గ్రామాన్ని సందర్శించి మృతి చెందిన బాలింత కుటుంబీకులను పరామర్శించి ఆర్థికసాయం అందించారు. మొదటి విడతలోనే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. పిల్లల చదువులకు భరోసా కల్పించారు. నాయకులు సునీల్‌జాదవ్, సోమోరే నాగోరావ్, విశాల్, రాజు, కాంబ్లే అతీశ్, అమోల్ తదితరులున్నారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి



రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సూచించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. వారికి అందిస్తున్న వైద్య సేవల గురించి డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ ద్వారా తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రిలో రోగులకు అందించే భోజనాన్ని పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని పేర్కొన్నారు. వైరల్ జ్వరాలు విజృంభిస్తున్న దృష్ట్యా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, నిత్యం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులున్నారు.

రుణమాఫీకి దూరమైన రైతులు

బోథ్: అధికారుల నిర్లక్ష్యంతో రైతులు రుణమాఫీకి దూరమవుతున్నారు. మార్లపెల్లి గ్రామానికి చెందిన సిందే శివాజీ బోథ్‌లోని పీఏసీఎస్ అధికారుల నిర్వాకంతో రుణమాఫీకి దూరమయ్యాడు. తాజాగా ఇదే గ్రామానికి చెందిన తూము గంగాధర్ ప్రాథమిక సహకార సంఘానికి ఎలాంటి రుణం లేకున్నా రూ.68,020 అప్పు ఉన్నట్లు సదరు అధికారులు రుణమాఫీ లిస్ట్‌లో పేరు పంపించారు. కాగా, గంగాధర్ స్థానిక టీజీబీలో రూ.1,58,253 రుణాన్ని పొందాడు. రెండుబ్యాంకుల్లో కలిపి రుణం రూ.2లక్షల పైగా ఉన్నట్లు చూపడంతో మాఫీ కాలేదు. తాను బోథ్ పీఏసీఎస్ నుంచి రుణం తీసుకోలేదని బాధితుడు వాపోతున్నాడు. అధికారుల నిర్లక్ష్యంతో అతడు రుణమాఫీకి దూరమయ్యాడు. పీఏసీఎస్‌లో చాలామంది రుణాలు చెల్లించినా, రుణమాఫీ లిస్టులో పేర్లు పంపగా మాఫీ కానట్లు తెలుస్తోంది.